తత్ఫలితంగా ఏ మనిషికైనా శారీరక, మానసిక పరీక్షలు చేసి ఆ ఎలక్ట్రానిక్ పరికరాల సహాయంతో శరీరంలో ఏ యోగచక్రం ఎంత వరకూ అభివృద్ధి చెందిందో శరీరంలో ఏ భాగం లోపభూయిష్టంగా వుందో, ఎక్కడ రోగలక్షణాలు చోటు చేసుకుంటున్నాయో అన్న సత్యాల్ని ప్రత్యక్షంగా చూపగల సైన్సు పరికరాలు జపాన్‌లో వున్న మోతోయామా పరిశోధనా కేంద్రంలో రూపుదిద్దుకున్నాయి.

మోతోయామా యోగిమాత్రమే కాదు. ఒక గొప్ప సైన్సు పరిశోధకుడు! తూర్పు దేశాలలోని ఆయుర్వేదం, ఆక్యుపంచర్, యునానీ వైద్యప్రక్రియల్లో దిట్ట! మనిషిలోని దివ్యశక్తులపై పరిశోధన చేసిన (RHINE) మహాశయుడి శిష్యుడు. గొప్ప ఎలక్ట్రికల్ ఇంజనీరు, కంప్యూటర్ సైంటిస్టు.

అంతేకాదు! మోతోయామా భవిష్యత్తుని స్వయంగా చూడగలిగే పుణ్యపురుషుడు.

మోతోయామా జీవితం అసాంతం తెలుసుకుంటే భగవంతుడి ఉనికి అర్థమవుతుంది.

అతను 1925లో జపాన్‌లోని షాడోషీమా అనే ద్వీపంలో జన్మించాడు. ఇతని తల్లి శైకోమోషీమా! గొప్ప భక్తురాలు. ఆమె పసివాడయిన మోతోయామాకు అయిదేళ్ళ వయసులోనే అధ్యాత్మిక సాధన ఎలా చేయాలో వివరించి నియమబద్ధమైన శిక్షణనిచ్చింది.

హిమప్రవాహాలలో, రక్తాన్ని గడ్డకట్టించే చలిలో తెల్లవారు జామునే మేల్కొని నిశ్చలమైన దీక్షతో సాధన గావించేవాడతను.

పసివాడవటంతో నిర్మలమైన అతని మనసు చాలా సులభంగా భగవంతుణ్ణి ఆకర్షించి త్వరలోనే అతనిలో అనేక దివ్యశక్తులు మేల్కొన్నాయ్.

దివ్యదృష్టినిచ్చే 'జ్ఞాననేత్రం' దానంతట అదే తెరుచుకుంది. శరీరంలోని యోగ చక్రాలూ, నాడులూ జాగృతం అయి-మనుష్యుల భవిష్యత్తులు తెలిసే దర్శనాలు, దివ్యానుభూతులు కలగటం మొదలయింది.

అంతేకాదు చదువులోకూడా అన్నింటా ముందుంటూ 1952లో పి.హెచ్‌డి. డిగ్రీనీ, మానసిక శాస్త్రంలో కూడా డిగ్రీని పొందాడతను.

ఇప్పటి సైన్సుతో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని జోడించి అతను ఒక నూతన విజ్ఞానాన్ని (Wisdom Science) కనిపెట్టాడు. విశ్వవిద్యాలయం స్థాయిలో సైన్స్ పరిశోధనా కేంద్రాన్ని స్థాపించాడు.

మనుష్యుల మనస్సులలో కలిగే తలంపులకూ వారికి కలిగే కష్టసుఖాలకూ ఏదో వర్ణించరాని జోడి వున్నదని అతను గమనించాడు. దాని ఫలితంగా మనిషి మెదడులోని ఆలోచనా తరంగాల్ని కొలవగల విద్యుత్ అయస్కాంత ప్రాణవాహక మార్పులను (Magnetic Physiological Changes) కొలిచే దిగ్భ్రాంతి పొందేలా అద్భుతంగా వున్నాయి.

ఇందులో చాలా మట్టుకు మనిషికి కలిగే చెడు కర్మ, తప్పుడు ఆలోచనలవల్ల శరీరంలో

ఏర్పడే మార్పులు- దానివలన జీవితం పెడదారి పట్టిపోయి కష్టాలకూ, దురదృష్టానికి కూడా ఎలా దారి తీస్తుందో స్పష్టంగా కనుగొన్నాడు. మోతోయామా.

ఒకరోజు స్కూల్‌లో చదువుతున్న తన పదేళ్ళ కొడుకుతో మోతోయామాని కలవటానికి వచ్చిందో స్త్రీ! ఆ పిల్లవానికి ఏదో తెలియని భయంతో స్కూల్‌లో మనస్సు- పరిపరి విధాల కంగారుకు లోనై, అతనికి సమస్యలనూ, బాధలనూ సృష్టించడంతో ఆమె ఎందరో డాక్టర్ల చుట్టూ తిప్పిందట. అయినా మార్పురాలేదు. దాంతో ఆమె మోతోయామాని కలిసింది. తన కొడుకు బాధలు వివరించింది.

అప్పుడు మోతోయామా ధ్యాన సమాధిలోకి వెళ్ళి పిల్లవాడి పుట్టుకకు కారణం చూపే 'కారణాత్మ'ను దర్శించాడు. అతని సూక్ష్మశరీరంలోని చక్రాలను పరిశీలించాడు. అప్పుడాయనకో సత్యం విశదమైంది. క్రితం జన్మలో ఆ పిల్లవాడు స్కాట్లాండ్‌లోని సైనికుడు. ప్రపంచ యుద్ధం సైన్యంలో ట్రైనింగ్ బెటాలియన్‌తో సహా జపాన్ పంపబడి, జపాన్ సైనికులకి ఖైదీగా చిక్కిపోయాడు. జపాన్ సైనికులు అతని కంఠానికి గురిపెట్టి తుపాకి పేల్చేయటంతో అతను మరణించాడు.

అలా జపాన్‌లో వ్యథాభరితుడై ఆదేశాన్ని ద్వేషిస్తూ మరణించడంతో ఆ దేశంతో అతడికి గట్టి కర్మ సంబంధం ఏర్పడి మరు జన్మలో అక్కడే తిరిగి జన్మించాడు. గత జన్మలో అతడి కంఠంపై బుల్లెట్లు దూసుకుపోయిన చోటనే ఎర్రని పుట్టుమచ్చ ఏర్పడి వుందిప్పుడు. ఐస్‌క్రీముల వంటి చల్లని వస్తువులు తింటే కంఠం విపరీతమైన నొప్పితో బాధపడేవాడా పిల్లవాడు. దీనికి 'మెడిసిన్'లో కారణం తెలియక డాక్టర్లు చేతులెత్తేశారు.

ఇలా మోతోయామా పూర్వజన్మలోని ఆ బాలుడి ఊరిపేరు. ఆ ప్రదేశాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించి చెప్పగా, ఆ పిల్లవాడు ఆశ్చర్యపడి ..... తనకి తరచుగా అవే కలలు వస్తుంటాయనీ, ఆ కలల్లో తాను జపాన్ దేశస్థుడిలా కాకుండా విదేశీయుడిలా అనిపించడం. తననెవరో సైనికులు కాల్చి చంపడం వంటి పీడకలలు రోజూ వస్తుంటాయని చెప్పాడు.

అప్పుడతను ఇలా అన్నాడు.

"మనిషికి చొక్కా వంటిదే ఈ శరీరం. నిజానికి అసలు వ్యక్తి అతని శరీరంలో దాగివున్న జీవాత్మ మాత్రమే! మనిషి చేసిన ఆలోచనలూ, పనులూ వాటి కర్మఫలితాలుగా ఈ జీవాత్మ తనలో నిక్షిప్తం చేసుకుంటుంది. అందుకే నీ శరీరం మరణించినా, మళ్ళీ అవే గుర్తులతో ఈ జన్మలోని శరీరం ఏర్పడింది" అంటూ ఆ పిల్లవాడి కంగారునూ, గజిబిజినీ విడమరిచి చెప్పాడు.

అతనిలోని సూక్ష్మశరీరాన్ని పావనం చేసి, చెడు కర్మ తొలగిపోయి ఆ మచ్చ కరిగిపోయే విధానం కూడా చూపించాడు.

అంతేకాకుండా మంచి కర్మ ఏమిటో, మనసులో రావలసిన మార్పులూ, దీనికి చేయాల్సిన దైవప్రార్థనా యిప్పటి శరీరంలో ఏ చక్రంలో ఏ విధంగా సాధన చేయాలో

వివరంగా బోధించాడు.

అయిదారు నెలల తర్వాత ఆ కుర్రవాడు ఎంతో హుషారుగా, ఆత్మ విశ్వాసంతో తిరిగి మోతోయామాని కలుసుకున్నాడు. అతని కంఠం మీద ఏ పుట్టుమచ్చాలేదు. ఇలాంటి సమస్యల కోసం మోతోయామాని దర్శించేవారు ఇప్పటికి ఎందరో" అంటూ ఆగాడు తిరుపతి. ఎవరూ మాట్లాడకుండా అతన్నే చూస్తున్నారు. వారి కళ్ళల్లో ఏవో భావాలు.

"కనుక దేవుడులేడు, ఆత్మలని విశ్వసించను అనడం మన తెలియనితనాన్ని, అజ్ఞానాన్నీ ప్రదర్శించుకోవడమే అవుతుంది.

మనిషి మరణించిన తర్వాతకూడా ఆత్మ అనేది మిగిలే వుంటుంది. అది ఈ శరీరంకంటే సత్యమైనది. పునర్జన్మలూ, కర్మలు, స్వర్గం, నరకం అనేవి పదాలగారడీ కాదు ....." అన్నాడతను తనవంకే చూస్తున్న వారితో ఎంతో ఆవేశంగా.

* * * * *

అప్పటివరకూ వెండి వెలుగుల్ని ప్రసరించిన నెలవంకని హఠాత్తుగా మబ్బులు చీకటి రాకాసుల్లో చుట్టుముట్టాయి. ఆ ప్రదేశమంతా మానవ కంకాళాలతో, ఎముకలతో నిండిపోయి భీభత్సంగా వుంది. త్రాచుపాములా మెలికలు తిరిగి ఉన్న కాలిబాట వెంట అక్కడికి చేరుకుందో ఆకారం.

నలుదిక్కులీ్న చూసింది. ఎటు చూసినా చీకటే! ఈదురుగాలులు ప్రారంభమయ్యాయ్. చెట్లు కరాళ నృత్యం చేస్తున్న పిశాచాల్లా వూగుతున్నాయ్. అతడేదో మంత్రం చదువుతూ, దక్షిణం వైపు చూశాడు. విచిత్రంగా అట్నుంచి చిన్నగా మొదలైన వికృత రోదన క్రమక్రమంగా పెరిగి, ఆ ప్రదేశాన్ని కంపింపజేస్తోంది. భయపడ్డట్టు ఆకాశం పెద్దగా ఉరిమింది.

అతను ఇసుక నేలపై కూర్చుని దీక్షగా మంత్రం పఠనం చేస్తూ వుండిపోయాడు చాలాసేపు.

గాలీ హోరూ ..... వాటితోపాటు, దట్టంగా ధూళి సుడులు తిరుగుతోంది. అతను మంత్రపఠనం ఆపి లేచాడు. దక్షిణం దిక్కుగా సాగిపోయాడు. ఆరడుగులు పైనున్న అతని శరీరం క్రమక్రమంగా చీకటిలో కలసిపోయింది. అప్పటివరకూ అతని చర్యల్ని ఓ సమాధి వెనుకనుంచి గమనిస్తున్న నక్కొకటి అతను కూర్చున్న ప్రదేశంవైపు నడిచింది.

* * * * *

తూర్పు నుంచి కాంతి పుంజాలు వెలువరుస్తూ ప్రత్యక్షమయ్యాడు దినకరుడు. రాత్రి మంచులో తడిసిన ఆకులపై పడి కాంతి పరావర్తనం చెందుతోంది. నిద్రపోతున్నట్టు పక్కమీద వున్న మహదేవ్ శరీరంలోకి గొట్టాల ద్వారా ఐ.వి. ఫ్లూయిడ్స్ చేరుకుంటున్నాయి. మంచం కింద అమర్చిన యూరిన్ బ్యాగ్ పచ్చని ద్రవంతో నిండిపోవటంతో ఆయాకి చెప్పి ఖాళీచేయించాడు అభిరాం. వరప్రసాదం మొహం వాడిపోయి వుంది. సమయానికి తిండి, నిద్రలేక అభిరాం, వరప్రసాదం బాగా నీరసంగా ఫీలవుతున్నారు.

తిరుపతి సాయంత్రం గోదావరిలో విశాఖపట్నం వెళ్ళిపోతానని చెప్పాడు. 'అతను మరికొన్ని రోజులు తమతోపాటే వుంటే బాగుణ్ను' అనుకుంటున్నారు అభిరాం, వరప్రసాదం!

నిజానికి తిరుపతికి కూడా వాళ్ళనలా వదిలేసి పోవటానికి మనస్కరించలేదు.

'కానీ తనుండి మాత్రం చేయగలిగిందేం వుంది? మహదేవ్ శారీరకంగా పడే చిత్రహింసల్ని నిస్సహాయంగా చూడటంతప్ప ..... ' అనుకున్నాడతను.

సరిగ్గా అప్పుడు జరిగిందా సంఘటన.

'స్స ..... స్స ..... స్స ..... గ్ర్ ..... గ్ ..... గ్ర్ ..... గ్గ్ .....'' భరింపలేని బాధతో మహదేవ్ మెలికలు తిరిగిపోతున్నాడు.

అభిరాం అతన్ని కదలకుండా పట్టుకున్నాడు. కానీ మహదేవ్‌ని ఆపటం అతని తరం కావటంలేదు. తిరుపతి కూడా అభిరాంకి సహాయంగా వెళ్ళాడు.

వరప్రసాదం కంగారుగా బయటకు నడిచాడు.

ఊపిరి పీల్చుకోలేకపోతున్నాడు మహదేవ్. ప్రాణవాయువు కోసం నీటి ఉపరితలం పైకి తేలిన జలచరంలా తలని పైకెత్తి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు. భరింపశక్యం కాని బాధని తెలుపుతూ అతని ముఖం ముడుతల్ని సంతరించుకుంది.

అభిరాం గుండె చెరువైంది. 'దేవుడా! ఎందుకీ శిక్ష?' దు:ఖంతో మౌనంగా ఆక్రోశించింది అతని మనసు.

అదే సమయంలో తిరుపతి దృష్టిని ఆకర్షించిందో దృశ్యం ..... మహదేవ్ కాళ్ళు నీలిరంగుకి తిరిగిపోతూ, వాచిపోతున్నాయ్.

'టక్ ..... ' తలుపు తెరుచుకుని వచ్చారు వరప్రసాదం, డాక్టర్. ఓ నిమిషం మహదేవ్ పరిశీలనగా చూసి--

ఇతనికి ఊపిరి పీల్చుకోవటం కష్టమైపోతుంది ..... న్యూమోనియా అవును ఇది న్యూమోనియానే అనుకున్నాడు డాక్టర్. మరుక్షణం కిట్‌లోంచి డిస్పోసబుల్ సిరంజ్ 'పెన్సిలిన్' ఇంజక్షన్ తీశాడు. అభిరాం, తిరుపతి, వరప్రసాదంలు మహదేవ్‌ని పట్టుకున్నారు. డాక్టర్ మహదేవ్ ఎడమ జబ్బమీద ఇంజెక్షన్ చేశాడు.

సరిగ్గా అప్పుడే మహదేవ్ గది తలుపు తోసుకుని వచ్చిన వ్యక్తిని చూసి ..... అందరూ ఆశ్చర్యంగా అటే చూస్తుండిపోయారు.

"మహదేవ్‌కేమయింది?'' హిస్టీరియా వచ్చినట్లు బిగ్గరగా అరుస్తూ అతని బెడ్ దగ్గరికి పరుగుతో వచ్చింది మనస్విని.

'ఆమెకీ విషయం ఎలా తెలిసింది' అనుకుంటూ, ఆమెకేం సమాధానం చెప్పాలో తెలియక కొట్టుమిట్టులాడారు. అభిరాం, వరప్రసాదంలు. ఆమె ఎవరో తెలియక మౌనంగా వుండిపోయాడు తిరుపతి.

"ఏం పర్లేదు. తగ్గిపోతుంది ..... ఇప్పుడే ఇంజక్షన్ చేశాను'' ఆమెని ఊరడిస్తూ అన్నాడు

డాక్టర్.

"మహదేవ్! ఏమిటిది? ఎందుకిలా అయిపోతున్నావ్?" అప్పటి వరకూ ఆమె గుండెల్లో ఘనీభవించిపోయున్న దు:ఖం కన్నీళ్ళ రూపంలో ఆమె బుగ్గలపై నుంచి జారుతూ మహదేవ్ నుదిటి మీద పడుతున్నాయ్. ఆమె రోదన ఆ గదిలో అలలు అలలుగా సుడులు తిరిగి అక్కడున్న అందరి హృదయాల్నీ వేదనాభరితం గావించింది.

గంగాభిషేకంలో పవిత్రతని సంతరించుకున్న పుణ్యక్షేత్రంలా అప్పటివరకూ భరించలేని బాధతో వంకర్లు తిరిగిపోయిన మహదేవ్ శరీరం నెమ్మదించటం మోదలుపెట్టింది. అతనికి ప్రాణవాయువు మామూలుగా అందుతున్నట్టు బలంగా తీస్తున్న అతని ఉచ్ఛ్వాస, నిశ్వాసలు అక్కడున్న అందరికీ స్పష్టంగా విన్పించాయ్.

"డోంట్ వర్రీ! హి విల్ బి ఆల్‌రైట్. తగ్గిపోతుంది పర్లేదు" అంటూ బయటికి నడిచాడు డాక్టర్.

ఉప్పెన వచ్చిపోయిన తర్వాత ప్రశాంతతని పొందిన ప్రకృతిలా ఆ గదిలోని వారందరి మనస్సులూ ఆందోళన నుంచి తేరుకున్నాయ్ ..... ఒక్క మనస్విని తప్ప .....

"అభిరాం ..... మహదేవ్‌కి మళ్ళీ ఏమయింది?" తీవ్రమైన దు:ఖం వల్ల ఆమె గొంతునుంచి మాట స్పష్టంగా రాలేదు.

"కొంచెం హెల్త్ కంట్రోల్ తప్పింది. ఇప్పుడు ఫర్వాలేదు" ఆమెకి పూర్తి వివరాలు చెప్పకుండా పొడిగా అనేశాడు అతను.

"మనిషి ఇంతలా కృశించిపోయి వుంటే ఫర్వాలేదంటారేమిటి?" ఎండిపోయి తెల్లగా పాలిపోయిన మహదేవ్ శరీరాన్ని చూస్తూ అందామె.

ఏమని సమాధానం చెబుతారు వాళ్ళు? చెబితే ఆమె తట్టుకోగలదా?

"ఎందుకు ఎవరూ మాట్లాడరు? అసలు మహదేవ్‌కు వచ్చిన జబ్బేమిటి?" నిలదీస్తున్నట్టు ప్రశ్నించిందామె.

"తగ్గిపోతుంది మనస్విని! ఊరకే బెంబేలు పడకు ..... " సాధ్యమైనంత ప్రశాంతత కనబరుస్తూ నెమ్మదిగా చెప్పాడు అభిరాం.

"లేదు! నాకేదో భయంగా వుంది. నిన్నంతా ఇందుకే కాబోలు నా మనసంతా తెలీని దిగులుతో చిత్రవధ అనుభవించి, మీ యింటికి అర్ధరాత్రి ఫోన్ చేస్తే మీరు వూర్లో లేరని మీ అమ్మమ్మ చెప్పారు. నాకెందుకో మహదేవ్ ఆరోగ్యంపై అనుమానం వచ్చింది. అతనింటికి వెళితే తాళం వేసుంది.

సరాసరి హాస్పటల్‌కి వచ్చేశాను ..... నా ప్రమేయం లేకుండానే నా మనస్సులోని బాధే నన్నిక్కడికి లాక్కొచ్చింది" సజల నయనాలతో ఆమె చెప్పింది విని ఆశ్చర్యపోయాడు అభిరాం, వరప్రసాదం. ఆశ్చర్యపోనిది తిరుపతి ఒక్కడే!